చేతిరాతపై పట్టు.. మార్కులు కొట్టు!

- చక్కని దస్తూరితో పది విద్యార్థులకు మేలు
- జవాబు పత్రాల మూల్యాంకనం చేసేవారిని ఆకర్షించేది ఇదే
- పలు పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ
- నిరంతర సాధనతో సత్ఫలితాలు



పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షలు ఆసన్నమవుతుండడంతో విద్యార్థులు రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తీర్ణత సాధించే విధంగా సర్కారు బడుల్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఏడాది పాటు నేర్చుకున్న పాఠ్యాంశాలను రెండున్నర గంటలలో కాగితంపై పెట్టాల్సి ఉంటుంది. అదీ స్పష్టంగా ఎలాంటి కొట్టి వేతలు లేకుండా ముత్యాల్లాంటి అక్షరాలతో జవాబులు రాయాల్సి ఉంటుంది. అందుకే ఇప్పుడు అందరి దృష్టి చేతి రాతపై నిలిచింది.

నిత్య సాధనతోనే సాధ్యం

ఒక్కసారిగా రాత విధానం మార్చుకోవాలంటే నిత్యం సాధన చేయాల్సిందే. తొమ్మిదో తరగతి వరకు దస్తూరీ ఎలా ఉన్నా పదో తరగతి ప్రారంభం నుంచి దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తే మంచి ఫలితం ఉంటుంది. చేతి రాతలో పరిణితి చెందాలంటే నిత్యం నాలుగైదు పేజీలు రాయాల్సి ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తెలుగుతో పాటు ఆంగ్లం, హిందీ సబ్జెక్టులపై ఇదే విధానం అమలు చేయాలి. పైకి చదువుతూ రాయడం వల్ల జవాబులు బాగా గుర్తుండటంతో పాటు అక్షరాలు అందంగా రాయడం అలవాటవుతుంది.

కొట్టివేతలు లేకుండా రాయాలి

నెమ్మదిగా రాస్తే పరీక్షలలో సమయం సరిపోదు. వేగంగా రాసేటప్పుడు తప్పులు దొర్లకుండా ముత్యాల్లాంటి అక్షరాలు రాసేందుకు ప్రత్యేక తరగతులతో పాటు స్లిప్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఏ ప్రశ్నకైనా రాసే సత్తా ఉన్నా చేతిరాత బాగో లేకపోతే మార్కులు సాధించడం కష్టతరమవుతుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. పరీక్షా పత్రాలు దిద్దే వారిని చక్కని అక్షరాలతో ఆకట్టుకుని మార్కుల శాతం పెంచుకోవచ్చునని సూచిస్తున్నారు. రాసే ప్రతి అక్షరం, అందంగా గుండ్రంగా ఉండాలి. అక్షర దోషాలు లేకుండా అవసరమున్న చోట ఫుల్‌స్టాప్, కామా తదితర గుర్తులను ఉపయోగించి సమాధానాలు రాయాలి. అక్షరాలు కొన్ని చిన్నవిగా మరి కొన్ని పెద్దవిగా ఉండకుండా అన్నీ ఒకే ఆకారంలో ఉండేటా చూసుకోవాలి. జవాబు పత్రంలో కొట్టి వేతలు లేకుండా రాయాలి.

గుండ్రంగా రాస్తున్నా



గతంలో కంటే ఇప్పుడు నా రాత మెరుగుపడుతోంది. నిత్య సాధనతోనే ఇది సాధ్యమైంది. ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి చదివించడం ఉపయుక్తంగా మారింది. ఎప్పటికప్పుడు ప్రశ్నలకు జవాబులు రాయిస్తున్నారు. దీంతో తప్పులు రాయకుండా గుండ్రంగా రాయడం అలవాటైంది.

జి.లేస్య ప్రజ్ఞ, పదో తరగతి విద్యార్థిని, గాడిలంక.

మంచి మార్కులొస్తాయి..



ముత్యాల్లాంటి అక్షరాలతో మార్కులకు డోకా ఉండదు. చేతి రాత మెరుగుపర్చేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. జవాబు పత్రాలు దిద్దేవారికి రాత సులభంగా అర్థమైనప్పుడు మంచి మార్కులు వేసేందుకు అవకాశముంటుంది. తక్కువ సమయంలో అస్పష్టమైన సమాధానాలు దిద్దే అవకాశం లేకపోతే విద్యార్థులు నష్టపోతారు. తక్కువ రాసినా తప్పు లేకుండా అందంగా రాయడం వల్ల దిద్దేవారిని ఆకట్టుకుని మార్కులు సాధించవచ్చు.

ఉదయ భాస్కరరావు, హెచ్‌ఎం, గాడిలంక హైస్కూలు.

క్లుప్తంగా

వెంకన్న హుండీ ఆదాయం రూ.13.58 లక్షలు



దేవస్థానంలో నిర్వహిస్తున్న హుండీల లెక్కింపు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. రెండు నెలల తొమ్మిది రోజులకు గానూ రూ.13.58 లక్షలు ఆదాయం సమకూరింది. దేవదాయ శాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణ, పోలీసు బందోబస్తు నడుమ హుండీలు తెరిచి లెక్కించినట్లు దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, కమిటీ సభ్యులు మోకా వెంకట సుబ్బారావు, గోకరకొండ లక్ష్మణరావు, గన్నవరపు శ్రీనివాస్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

అమలాపురం రూరల్: ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీన మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ వి నరేష్ బుధవారం తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని కేసులను పరిష్కరించుకోవాలని జడ్జి నరేష్ కోరారు. న్యాయవాదులు, బ్యాంక్, రెవెన్యు అధికారులు హాజరై కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

బాధిత బాలికకు ఎమ్మెల్సీ పరామర్శ



జీజీహెచ్‌లో చిన్నారి లాస్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అల్లవరం: ఇటీవల గోడి గ్రామంలో విద్యుత్ ప్రమాదానికి గురై కుడి చేతిని కోల్పోయిన చిన్నారి లాస్య, ఆమె తల్లి రమాదేవిని కాకినాడ జీజీహెచ్‌లో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం పరామర్శించారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో చిన్నారి చేతిని కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి గానీ, విద్యుత్ అధికారుల నుంచి గానీ ఎటువంటి స్పందన లేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తక్షణమే స్పందించి చిన్నారి లాస్య, ఆమె తల్లి రమాదేవిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సీసీ రహదారికి శంకుస్థాపన

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు ప్రధాన రహదారి నుంచి ప్రజా సంఘాల కార్యాలయం వరకు నిర్మించే సీసీ రహదారికి ఎంపీపీ రాయుడు సునీత బుధవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులతో ఈ రహదారిని నిర్మిస్తున్నారు. ప్రైవేటు స్థలంలో రహదారి నిర్మిస్తున్నారంటూ కొందరు అడ్డు చెప్పడంతో గత కొంత కాలంగా వివాదం నెలకొంది. అయితే బుధవారం పంచాయతీ అధికారుల సమక్షంలో రహదారి నిర్మాణంపై చర్చలు జరిపి ఎట్టకేలకు రహదారి నిర్మాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నున్న శంకర నారాయణ, నాయకులు రాయుడు గంగాధర్, రెడ్డి రెడ్డిబాబు, వి.శ్రీనివాస్, టి.ఈశ్వరరావు, అత్తిలి బాబూరావు, రోళ్ల చక్రవర్తి, వల్లు రాజబాబు, ఎలిపే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అల్లవరం: ఇటీవల అల్లవరం మండలం దేవగుప్తం గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా ఇల్లు దగ్ధం కావడంతో నిరాశ్రయులైన బుంగ చిట్టిబాబు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం పరామర్శించారు. బొమ్మి నరసింహమూర్తి, మంగయమ్మ ఫౌండేషన్ ద్వారా చిట్టిబాబు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు, ఇతర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధనాల వెంకట్రావు, చింతా రామకృష్ణ, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఎన్.ఏలియా రాజు, జంగా వెంకటేష్, బుంగ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వీడియో పాఠ్యాంశాల ఆవిష్కరణ

అమలాపురంటౌన్: జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో అమలాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన వీడియో పాఠ్యాంశాలను డీఈవో షేక్ షలీమ్ బాష ఆవిష్కరించారు. పదో తరగతి విద్యార్థుల కోసం సబ్జెక్ట్ నిపుణులు ప్రత్యేకంగా రూపొందించిన ఈ వీడియో పాఠ్యాంశాలను జిల్లా విద్యాశాఖాధికారి బుధవారం ఉమ్మడి పరీక్షల విభాగం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పాఠ్యాంశాలు పూర్తి వివరణతో పాటు పటాలు, పట్టికలు, ప్రశ్నా పత్రాల విశ్లేషణ ఈ వీడియోలలో ఉండనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బేర హనుమంతరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు విజయ్ కుమారి, సబ్జెక్ట్ నిపుణుడు, గణిత అవధాని మూర్తి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరికి బంగారు బొట్టు సమర్పణ

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామంలో వేంచేసి యున్న బాలా త్రిపుర సుందరీ దేవికి దాత బంగారు బొట్టు బహూకరించారు. గ్రామానికి చెందిన దాసరి సర్వేశ్వరరావు దంపతులు అమ్మవారికి ఒక గ్రాం బంగారంతో బంగారు బొట్టును తయారు చేయించారు. దీనిని ఆలయ అర్చకులు సాయిప్రసాద్‌కు దాత అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి అలంకరించినట్లు అర్చకులు సాయి ప్రసాద్ తెలిపారు.

కార్మిక సభకు తరలి రావాలి



గొల్లవిల్లిలో కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉప్పలగుప్తం: ఫిబ్రవరి 2న రామచంద్రపురంలో జరిగే కార్మికుల ఆత్మ గౌరవ సభకు కార్మికులంతా తరలి రావాలని రాష్ట్ర కార్పెంటర్ల సంఘ ఉపాధ్యక్షుడు వీరవెల్లి చినబాబు కోరారు. మండలంలోని గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో భీమేశ్వర తాపీ మేస్త్రీల సంఘం, భీమేశ్వర ఎలక్ట్రీషియన్, రాడ్ బెండింగ్, ఐరెన్, కాంక్రీటు, ప్లంబింగ్, వడ్రంగి మేస్త్రీల సంఘాల నాయకులు బుధవారం సమావేశమై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం తెరిచే ప్రయత్నం చేయాలని కోరారు. అది తెరిస్తే భవన నిర్మాణాలపై ఆధారపడిన 32 రకాల చేతి వృత్తుల వారికి చేయూత అందుతుందన్నారు. ఈ సమస్యలన్నింటినీ సభకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు విన్నవించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలంటూ ఆందోళన



ఆందోళన చేస్తున్న గుత్తెనదీవి, జి.మూలపాలెం గ్రామస్తులు

ఐ.పోలవరం: శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించి సౌకర్యాలు కల్పింపించాలని కోరుతూ ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి, జి.మూలపాలెం గ్రామాలకు చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఆందోళన నిర్వహించారు. మూడు ఎకరాల రెండు సెంట్ల శ్మశాన వాటిక స్థలంలో ఆక్రమణలు పోగా నలభై సెంట్ల స్థలం మాత్రమే మిగిలిందన్నారు. ఆ కొద్దిపాటి స్థలంలోనే ఇబ్బందులు పడుతూ అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటిక ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి పరిరక్షించాలని నినాదాలు చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అక్రమార్కులు చెర నుంచి శ్మశాన వాటిక స్థలాన్ని విడిపించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

గోశాలలో ఉచిత పశువైద్య శిబిరం



గోశాల ప్రతినిధులకు పశువుల మందులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, పశు వైద్యాధికారులు

అమలాపురం టౌన్: జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా స్థానిక శ్రీ గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాలలో బుధవారం పశు ఉచిత వైద్య శిబిరం జరిగింది. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో గోశాలలోని దాదాపు 150 గోవులకు ఉచిత వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు ప్రారంభించారు. డాక్టర్ విజయరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకూ జంతు సంక్షేమ పక్షోత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. ఎవరైనా జంతు హింసకు పాల్పడితే ఐపీసీ 377 ప్రకారం నేరమని గుర్తు చేశారు. వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద ఈ నేరాలకు రూ.25 వేల జరిమానా, 6 సంవత్సరాల జైలు శిక్ష పడుతుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి మాట్లాడుతూ వన్య ప్రాణుల చట్టాలు, సెక్షన్ల పట్ల అంతా అవగాహనతో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా గోశాలను సందర్శించిన విద్యార్థులకు డాక్టర్ విజయరెడ్డి అవగాహన కల్పించారు. వన్య ప్రాణ చట్టాలు, హక్కులపై ముద్రించిన కర పత్రాలను శిబిరంలో పాల్గొన్న వారికి పంపిణీ చేశారు. గో సేవ చేస్తున్న గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావును డాక్టర్ విజయరెడ్డి తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో 28, 29 వార్డుల కౌన్సిలర్లు గోపి రాజీ రమేష్, చిత్రపు రామకృష్ణ, పశు వైద్యాధికారులు నారాయణరావు, పూర్ణిమ, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

జన కల్యాణ్ ఉద్యోగులకు శిక్షణ



ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీను

అమలాపురం రూరల్: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ పర్యవేక్షణలో అమలాపురం జన కల్యాణ్ ప్రివెన్షన్ యూనిట్ కార్యాలయంలో జన కల్యాణ్ ఉద్యోగులకు శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంబేద్కర్ కోనసీమ జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భరతలక్ష్మి, జిల్లా దిశ నుంచి డిస్ట్రిక్ట్ ఐసీటీసీ సూపర్‌వైజర్ ఏ.బుజ్జిబాబు, రత్నరాజులు హాజరయ్యారు. పీఎంపీఎస్‌ఈ ప్రాముఖ్యత గురించి ఉద్యోగులకు వివరించారు. జన కల్యాణ్ ప్రాజెక్ట్ మేనేజర్ జి.శ్రీను, యూతఈ టీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ టీ.రాజా తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జన కల్యాణ్ ఉద్యోగులు, ఏఎన్ఎం రమణి తదితరులు పాల్గొన్నారు.

చొల్లంగి తీర్థం.. జన సంద్రం



బ్రహ్మ సమేధ్యంలో సూర్యోదయ సమయంలో సముద్ర స్నానం చేస్తున్న భక్తులు



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం

కాట్రేనికోన: పల్లం పంచాయతీ బ్రహ్మ సమేధ్యంలో నిర్వహించిన చొల్లంగి తీర్థానికి భక్తులు పోటెత్తడంతో జన సంద్రమైంది. మంగళవారం తీర్థానికి చేరుకున్న భక్తులు రాత్రి వేళ ఆలయ కమిటీ ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించి ఆనంద పరవశులయ్యారు. బుధవారం వేకువ జామునే సముద్ర స్నానం ఆచరించిన భక్తులు కాల భైరవ స్వామి, పార్వతీ సమేత బ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. సంతానం కోసం మహిళలు సముద్ర స్నానం చేసి స్వామి పాదముద్ర చుట్టూ నిద్రలోకి జారుకున్నారు. స్వామి కరుణతో సంతానం పొందిన భక్తులు బిడ్డలతో పాటు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సముద్ర స్నానం ఆచరించే భక్తులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి భక్తులకు ఆలయ కమిటీ అన్న వితరణ చేసింది. గ్రామస్తుల ఆర్థిక సహాయంతో నిర్మించిన నూతన ఆలయంలో తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఆలయంలో కొలువు దీరిన దేవతా మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేయడంతో భక్తులను ఆకట్టుకుంది. చిర్రయానంలో కాలభైరవ స్వామి ఆలయంలో చొల్లంగి ఉత్సవాలు నిర్వహించారు.

బాపన్న నాయుడికి సత్కారం



నాయుడిని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: నన్నయ విశ్వ విద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ఎన్నికల్లో ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అమలాపురానికి చెందిన ఆకుల బాపన్న నాయుడిని ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ అండ్ ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా శాఖ నాయకులు బుధవారం సత్కరించి అభినందించారు. స్థానిక విద్యానిధి విద్యా సంస్థల్లో ఆయనను స్కూల్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు దొడ్డా సత్తిబాబు, అధ్యక్షుడు ఎస్‌వీ రమణారావు, కార్యదర్శి టీఎస్‌ఆర్ అయ్యప్ప నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.గోపీనాథ్, డివిజన్ అధ్యక్షుడు రత్నంరాజు తదితరులు అభినందించారు.

మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దోనిపాటి వెంకటేశ్వరరావు(90) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన 2002 నుంచి 2007 వరకు మునిపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. ఈయన ప్రముఖ న్యాయవాది డీబీ లోక్‌కు సోదరుడు. వెంకటేశ్వరరావు మృతికి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉచిత కంటి పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అమలాపురం రూరల్: అమలాపురం లయన్స్ క్లబ్‌లో వెదులపల్లి సత్యనారాయణమూర్తి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన శిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐ ట్రస్ట్ చైర్మన్ యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి పచ్చిగోళ్ల చిన్న రామస్వామి, కోశాధికారి జంపన సుమన్ వర్మ, లయన్స్ క్లబ్ కార్యదర్శి మద్దెల వెంకటేశ్వరరావు, ఐపీఎంసీసీ అనిల్ కుమార్ జైన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీకు వినతిపత్రం అందజేత



ఎంపీ హరీష్ మాధుర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఓఐ ఏజెంట్లు

అమలాపురం టౌన్: ఎల్ఐసీలో నూతనంగా వచ్చిన మార్పులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వీటిని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఓఐ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా యూనియన్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు ఏఓఐ ఏజెంట్లు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. జీఎస్టీని తగ్గించాలని, తగ్గించిన కమీషన్ పెంచాలని కోరారు. వీటితో పాటు మరికొన్ని డిమాండ్లను పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ గుమ్మలూరి వినాయకరావు, ట్రెజరర్ దొమ్మేటి శివస్వామి, అధికారి బాబ్జి, కోరుమిల్లి మధు, మట్ట దుర్గా శ్రీనివాస్ గౌడ్, కేత వీరాస్వామి, కడలి శ్రీనివాసరావు శీలం లంకేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో బంగారు పతకం



బంగారు పతకం పొందిన హంట్ ఫర్ ఫుడ్ చిత్రం

రాజోలు: ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో పాదలాడకు చెందిన కాకర రవితేజ బంగారు పతకం సాధించారు. ఈ నెల 27, 28 తేదీల్లో కేశవపల్లిలో ఫొటో వర్క్‌షాప్ జరిగింది. సుమారు 40 మంది ఫొటోగ్రాఫర్లు పోటీల్లో పాల్గొన్నారు. శంకరగుప్తం మేజర్ డ్రైన్‌లో చేపల వేటను చిత్రీకరణ చేసిన రవితేజ ఫొటోకు (హంట్ ఫర్ ఫుడ్) బంగారు పతకం లభించింది. అలాగే మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన మీర్ జవాద్ అలీ తీసిన ప్రకృతి సోయగం చిత్రానికి వెండి పతకం లభించింది. సఖినేటిపల్లి మండలం గొంది కి చెందిన ఫొటోగ్రాఫర్ బుంగా ఎనోష్ ఫొటోకు సిల్వర్ మెడల్ దక్కింది. విజేతలను పలువురు అభినందించారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పి.గన్నవరం: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్త, అత్త, ఆడపడుచులు, మరిదిపై పి.గన్నవరం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊడిమూడి గ్రామానికి చెందిన సీహెచ్ సౌజన్య విశాఖపట్నంలోని ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు 2023 మార్చి 24న అయినవిల్లి మండలం ఎరుకల్లంకకు చెందిన పాము రాజకుమార్ అలియాస్ వరప్రసాద్‌తో తొత్తరమూడిలో వివాహం జరిగింది. వివాహ సమయంలో అబ్బాయికి రూ.4.5 లక్షల కట్నం, ఆడపడుచు లాంచనాలు, బైక్ ఇచ్చినట్టు వివరించారు. అనంతరం అదనపు కట్నం కోసం భర్తతో పాటు, అత్త, ఇద్దరు ఆడపడుచులు, మరిది కలసి సౌజన్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని, దీంతో నాలుగైదు సార్లు పెద్దల సమక్షంలో తగవు పెట్టినా ఫలితం లేదన్నారు. అత్తింటి వారి వేధింపులు ఆగకపోవడంతో సౌజన్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ వివరించారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలెంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసిన ఘటనపై ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన కొల్లాటి రాంబాబు, సతీమణి సీతకు, అదే గ్రామానికి చెందిన పినపోతు రవికుమార్, కుటుంబ సభ్యులు మధ్య పాత గొడవలు ఉన్నాయన్నారు. వీటిని పురస్కరించుకుని దారికి అడ్డంగా రాంబాబు తన బైక్‌ను పెట్టాడని, సదరు బైక్‌ను తీయమని రవికుమార్ అడగ్గా ఇరు వర్గాల మధ్య వైరం పెరిగి కర్రలతో కొట్టుకున్నారన్నారు. రాజోలు ప్రభుత్వాస్పత్రిలో వారంతా చికిత్స పొందుతున్నట్టు, దీనిపై ఇరు వర్గాల మీద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అన్నారు.